నల్లరాయి దోపిడీపై విచారణ జరిపించాలి

ప్రజాశక్తి- హుకుంపేట:మండలంలోని కొట్నాపల్లి పంచాయతీ పరిధిలో నల్లరాయి క్వారీకి సంబంధించి అవినీతి, అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.కృష్ణారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మాట్లాడుతూ క్వారీ అనుమతుల మంజూరులో సంబంధిత అధికారులు భారీగా అవినీతికి పాల్పడి, తప్పుడు నివేదికలతో అనుమతులు పొందేలా చేశారన్నారు. ఈ వ్యవహారంలో కోట్లు రూపాయలు చేతులు మారినట్లు వెల్లడించారు. పిసా గ్రామసభ తీర్మానం లేకుండా క్వారీ ఏర్పాటుకు అధికారుల నుంచి అనుమతులు ఇవ్వడం రాజ్యాంగ ఉల్లంఘన అని పేర్కొన్నారు. అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్, ఐటిడిఎ పీఓ, సబ్ కలెక్టర్ కలిసి అభివృద్ధి పేరుతో అనుమతులు ఇచ్చినా, అవి గడువు ముగిసినప్పటికీ క్వారీ యజమానులు నెలవారీ మామూళ్లతో అక్రమంగా మైనింగ్ కొనసాగిస్తున్నారని అన్నారు. లోపాయికార ఒప్పందాలలో పాత్ర వహించిన అధికారులను కఠినంగా శిక్షించాలన్నారు. గత కొన్ని వారాలుగా క్వారీకి వ్యతిరేకంగా గ్రామస్థులు ఆందోళనలు చేస్తున్నా, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదన్నారు.

విద్యతోనే మన్యం అభివృద్ధి

-జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్

-ఘనంగా మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్

మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి పాడేరు: అల్లూరి ఏజెన్సీలో మెగా పేరెంట్స్ మీటింగ్ గురువారం విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలోని 22 మండలాల్లో 2900 పాఠశాలల్లో ఒక పండుగ వాతావరణం లో పేరెంట్స్ సమావేశాలు ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రుల కలయికలో మెగా పేరెంట్స్ మీటింగ్ లతో ఒక నూతన ఒరవడికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా పాఠశాలల్లో పేరెంట్స్ తో మొక్కల ప్లాంటేషన్ కార్యక్రమం కూడా నిర్వహించారు. జిల్లాలోని ఈ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ పురస్కరించుకొని 92 వేల మొక్కలను నాటారు . ఆయా పాఠశాలల్లో చదివే విద్యార్థుల ప్రోగ్రెస్ ను కూడా వారి పేరెంట్స్‌కు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు వివరించారు. జిల్లాలో ఈ మెగా పేరెంట్స్ సమావేశాలు ఉత్సాహంగా జరిగాయి. పాడేరు మండలం గుత్తుల పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో సర్వశిక్షాభియాన్ ఏర్పాటు చేసిన మెగా పి టి ఎమ్ 2.0 కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్, ఎస్పీ జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్య మాన్ పటేల్, మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రభుత్వం అందిస్తున్న విద్యా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలలో వసతులు సమకూర్చడంతో పాటు విద్యాప్రమాణాల స్థాయి ఎలా ఉందో ప్రతీ విద్యార్ధి తల్లిదండ్రులు తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమం ఏర్పాటు చేసిందని, జిల్లాలో తల్లికి వందనం సంబంధించి ఎంత మంది పిల్లలు ఉన్న తల్లులకు తల్లికి వందనం అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో జిల్లాలో 1,52,013 మంది తల్లులు ఉండగా 1,56,182 మంది పిల్లలకి గాను తల్లుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాలో రూ.20కోట్ల, 30లక్షల, 6,600 జమ చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 80శాతం మంది పిల్లలు రెసిడెషియల్‌లో ఉంటున్నారని, జిల్లా పిల్లలు క్రమశిక్షణతో ఉంటారన్నారు. యోగాంధ్రాకి హాజరై క్రమశిక్షణ తో పాల్గొని జిల్లాకి మంచి పేరు తెచ్చారని అభినందనలు తెలిపారు. మెగా పేరెంట్స్ మీటింగ్ మంచి ఫలితాలు ఇస్తుందన్నారు. పిల్లలో ఉన్న సృజనత్మకత గుర్తించాలన్నారు. మన్యం ప్రాంత అభివృద్ధికి చదువే కీలకమన్నారు. ఈ సంవత్సరం 30వేల ఎకరాలు కాఫీ మొక్కలు పెంపకానికి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం సొమ్ము పడిందా అని తల్లులతో ఆరాతీశారు. స్కూల్ యూనిఫామ్ లో లేని పిల్లలను గుర్తించి ఎందుకు యూనిఫామ్ ఇవ్వలేదని ట్రైబుల్ వెల్ఫేర్ ఉపసంచాలకులు, ప్రధానోపాధ్యాయులను ఆరా తీశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పిల్లలు తయారు చేసిన క్రాఫ్ట్ ఐటమ్స్ తిలకించారు.

ఎస్పీ అమిత్ బర్దార్ మాట్లాడుతూ, పిల్లలని స్కూల్‌కు పంపాల్సిన భాద్యత తల్లిదండ్రులదెనన్నారు, నెలకి ఒక సారి పాఠశాలలకి తల్లిదండ్రులు వచ్చి పిల్లల చదువు తదితర అంశాలపై తెలుసుకోవాలన్నారు.

మాజీ శాసన సభ్యులు గిడ్డి ఈశ్వరి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం విద్యా, ఆరోగ్యం పై దృష్టి సారించిందన్నారు.పౌష్టిక ఆహారం అందజేయడం జరుగుతుందన్నారు.

పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ మాట్లాడుతూ, జిల్లాలో 1.7 లక్షల మంది పిల్లలకు కిట్స్ అందచేయనున్నట్లు తెలిపారు.విద్యార్థులు పలు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు.పిల్లలతో వివిధ రకాల ఆటలపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రాహ్మజీరావు, సర్వశిక్షాభియాన్ ఎపిసి స్వామి నాయుడు, సంక్షేమ శాఖ ఉపసంచాలకులు రజనీ, ట్రైకార్ డైరెక్టర్ కూడా కృష్ణా రావు, ప్రధానోపాధ్యాయులు ఎస్. సింహాచలం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు

జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి-పెదబయలు:ప్రభుత్వ పథకాలు అందరికీ అందించడమే ప్రభుత్వం లక్ష్యం అని జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. గలగండ గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. మండల అధ్యక్షులు సీకారి సుకుమారి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు అనంతరం ఇంటింటికి చైర్మెన్ కిడారి శ్రావణ్ కుమార్ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. అనంతరం కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే సుపరిపాలన తొలి అడుగు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పెదబయలు మండలం అధ్యక్షురాలు రైతు సంఘం పార్లమెంట్ ఉపాధ్యక్షులు కూడ. భూషణరావు, తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పాంగి. నాగేశ్వరావు, దారేల సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, బాకూరు సర్పంచ్ వెంకటరమణ రాజు, సర్పంచ్ శశి భూషణ్, నారంజి. ప్రసాద్, బత్తిరి. రామారావు, కిముడు. మహేశ్వరీ, సీకరి. వెంకటరమణ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై ప్రణాళికలు సిద్ధం చేయండి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : స్వరాంధ్ర విజన్ 2047 పై సమగ్రమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. ఈనెల 11 వతేదీన జిల్లా గిరిజన సంక్షేమ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి జిల్లా అధికారులతో కలెక్టరేట్లో సమీక్షిస్తారని పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమన్వయం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అధికారులు జిల్లా విజన్ కార్యచరణ ప్రణాళిపై సమన్వయంతో పని చేయాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవన శాఖ, పర్యాటకం, మహిళా శిశు సంక్షేమం, పేదరిక నిర్మూలన పీ 4పై జిల్లా ఇంచార్జి మంత్రి గుమ్మడి సంధారాణి సమీక్షిస్తారని చెప్పారు. అనంతరం హెూం మంత్రి వంగల పూడి అనితతో కలిసి స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారని అన్నారు. గంజాయి సాగు విడిచి పెట్టిన రైతులకు ఉద్యాన వన మొక్కలను పంపిణీ చేస్తారని చెప్పారు. ఇద్దరు మంత్రుల పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, ఇంచార్జి డిఆర్ఓ ఎంవిఎస్ లోకేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్.బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యాన వన అధికారి ఎ.రమేష్ కుమార్‌రావు, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మజీరావు, పిడిలు విద్యాసాగర్, మురళి పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలు ఏదీ?

-అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి అరకులోయ రూరల్:ఇది మెగా మీటింగ్ కాదని, దగా మీటింగ్ అని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. గురువారం అరకులోయ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైసీపీ నేతలతో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన సంవత్సర కాలంలో ఎన్నో మెగా మీటింగ్లు,ప్రజలకు ఎన్నో కల్లబొల్లి మాటలతో దగ పనులు చేశారని తెలిపారు.ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికి అమ్మ ఒడి 15000 ఇస్తున్నట్టు ప్రచారం చేసుకున్నా, ఇప్పటికి చాలా మంది తల్లుల ఖాతాల్లో డబ్బులు జమ కాని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఏడాది పాలనలో ఉద్యోగాల భర్తీ,నిరుద్యోగ భృతి మాట లేకుండా చేశారన్నారు. ,నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అన్నధాత సుఖీభవ రైతు భరోసా జూన్ 20 తేదీన ఇస్తామని చెప్పి మళ్ళీ మాటమార్చారన్నారు. గత జగనన్న ప్రభుత్వంలో మే నెలలోనే రైతు భరోసా వచ్చేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం రైతులను దగా చేసిందని పేర్కొన్నారు. పేరెంట్స్ మీటింగ్ వలన డబ్బులు వృధా తప్పితే విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎటువంటి ఉపయోగం లేదని తెలిపారు. గిరిజన ప్రాంతంలో చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని,వాటిపై దృష్టి సారించాలని సూచించారు. అల్లూరి జిల్లాలో డోలి మోతలు గల గ్రామాలకు రహదారులు నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి,డోలి మోతలు నివారణకు చర్యలు చేపట్టే విధంగా చూడాలన్నారు. అన్ని వర్గాల ప్రజలను కూటమి ప్రభుత్వం మోసం చేసిందని,ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొనవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు, మాజీ ఉమ్మడి విశాఖపట్నం ఎస్టీ సెల్ అధ్యక్షుడు కమ్మిడి అశోక్, అల్లూరి జిల్లా వైసీపీ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు పెట్టెలి శంకర, మండల పార్టీ అధ్యక్షులు స్వాబి రామ్మూర్తి, డుంబ్రిగూడ మండల పార్టీ అధ్యక్షులు పాంగి పరశురామ్ పెదలబుడు 3 ఎంపీటీసీ సభ్యులు సమర్ధి శత్రుగును తగితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో అదనంగా సీట్లు పెంచాలి

- ఐటిడిఏ పిఒకు ఎస్ఎఫ్ఐ వినతి

వినతిపత్రాన్ని ఇస్తున్న అప్పలనర్స, నాయకులు

ప్రజాశక్తి పాడేరు:- గిరిజన సంక్షేమ గురుకులం విద్యాలయం కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్‌లో ఎంట్రెన్స్ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించాలని ఇందుకోసం అదనంగా సీట్లు పెంచాలని కోరుతూ ఆదివాసి గిరిజన సంఘం, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం నేత పి. అప్పలనరస మాట్లాడుతూ. గురుకులం విద్య-విభాగం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్సీ ఎంట్రన్స్ ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అడ్మిషన్ కల్పించాలని, ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ లో అడ్మిషన్ నిమిత్తం ప్రభుత్వం నిర్వహించిన పరీక్షలకు ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థిని విద్యార్థులకు అడ్మిషన్ కల్పించడంలో తీవ్రమైన ఆంక్షలు విధించారని పేర్కొన్నారు.10వ తరగతి ఉత్తీర్ణత శాతం 60 శాతం పై బడి ఉన్నవారికి మాత్రమే కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ లో కల్పించాలని. నిబంధనతో గిరిజన విద్యార్థిని విద్యార్థులు అడ్మిషన్ కోల్పోతున్నారన్నారు. గిరిజన ప్రాంతం అత్యంత వెనుకబడి ఉన్న ఈ ప్రాంతాలలో ప్రాథమిక విద్య నుండి పదవ తరగతి వరకు విద్యా వ్యవస్థలో నాణ్యమైన విద్య అందించుటకు ప్రభుత్వం ప్రత్యేకమైన చర్య తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో కాలేజ్ ఆఫ్ ఎక్సెన్స్ పరీక్షతో పాటు పదవ తరగతి పరీక్షలో 60శాతం మార్కులు సాధించిన వారికి కాలేజ్ ఆఫ్ ఎక్షులెన్సులో అడ్మిషన్ కల్పించాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.జీవన్ కృష్ణ మాట్లాడుతూ గురుకులంలో ధరఖాస్తు చేసుకొన్న వారందరికీ అడ్మిషన్ కల్పించుటకు అదనపు సీట్లు కేటాయించాలని కోరారు. ముఖ్యంగా బాలిక కళాశాలలు కేవలం 2 మాత్రమే ఉండటంతో గిరిజన విద్యార్థినిలకు అడ్మిషన్ లభించడం లేదన్నారు. విద్యార్థినిల కళాశాలలో సీట్లు అదనంగా పెంచాలని, ప్రతీ గురుకుల బాలురు, బాలికల కళాశాలలో ప్రతి గ్రూప్కు అదనంగా 20 సీట్లు పెంచాలన్నారు. గురుకులం స్కూల్సో బాలికల జూనియర్ కళాశాలగా అప్గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె. కార్తీక్ శ్రీను, పి. జీవన్ కష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి. చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు సరిచేసుకోకపోగా..

రైతులను బెదిరిస్తారా..?

- రైతుసంఘం నాయకులు కుంజా నాగిరెడ్డి

మాట్లాడుతున్న రైతు సంఘ నాయకులు కుంజా నాగిరెడ్డి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: బాండ్ పొగాకుకు సంబంధించిన గాడ్ ఫ్రై ఫిలిప్స్ కంపెనీ యాజమాన్యం గత ఏడాది రైతులను మోసం చేసి, ఆ తప్పులను సరిచేసుకోకపోగా రైతులకు ఫోన్ చేసి బెదిరించడం ఎంతవరకు సమంజసమని రైతులను బెదిరించే అధికారం ప్రైవేట్ కంపెనీకి ఎవరిచ్చారని రైతుసంఘం నాయకులు మండి పడ్డారు. గురువారం పంకు సత్తిబాబు అధ్యక్షతన రేఖపల్లిలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో రైతు సంఘం నాయకులు కుంజా నాగిరెడ్డి, వడ్లాది రమేష్ మాట్లాడుతూ ఏజెన్సీలో బాండ్ కంపెనీ వ్యవసాయం చేయడానికి ఎటువంటి అనుమతి లేకపోయినా రైతులకు లాభాలు వస్తాయని మాయమాటలు చెప్పి అధిక దిగుబడి వచ్చేట్లు చేసి చివరకు తనకు ఇష్టం వచ్చిన ధరలు నిర్ణయించి తక్కువ ధరకే గత ఏడాది పొగాకు కొనుగోలు చేసి కంపెనీ రైతులను మోసం చేసిందన్నారు. చిన్న సన్నకారు రైతులకు బాండ్ పొగాకు కంపెనీ తీవ్ర నష్టాన్ని మిగిలిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుసంఘం నాయకులతో చర్చలు జరపకుండా మళ్లీ ఈ ఏడాది పంట వేయాలని వస్తే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ముంపు వాసులకు టార్పాలిన్లు ఇవ్వాలి



నిర్వాసితులు వేసుకున్న గుడిసెలు

ప్రజాశక్తి - విఆర్ పురం: మండలంలోని ముప్పుకు గురవుతున్న గ్రామాలు వడ్డిగూడెం, వడ్డిగూడెంకాలనీ, శ్రీరామగిరి, ధర్మతాలగూడెం, రామవరం అడివెంకన్నగూడెం చింతరేగుపల్లి, గ్రామస్తులు మైదాన ప్రాంతంలో గుడిసెలు వేసుకున్నారు వారికి రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే టార్పలిన్‌లు ఇవ్వాలని మండల నిర్వాసిత గ్రామస్తులు కోరుతున్నారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో సంభవించే వరదలకు ముందుగానే ఆయా కుటుంబాల వారికి టార్పాలిన్లు ఇస్తే ఎత్తైన ప్రదేశాల్లో గుడారాలు నిర్మించుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి టార్పాలిన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ఎటపాక : పాఠశాలలకు 100 మీటర్ల దూరంలో ఉన్న కిరణా, పాన్‌షాపుల్లో పొగాకు ఉత్పత్తులు, మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎటపాక సిఐ కన్నప్పరాజు హెచ్చరించారు. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్‌లో భాగంగా ఎటపాక ఎస్సై అప్పలరాజు సిబ్బందితో కలిసి నెల్లిపాక , నల్లకుంటలో హై స్కూల్, ప్రాథమిక పాఠశాల పరిసర ప్రాంతాల్లో సుమారు 100 మీటర్లు దూరంలో పాన్‌షాప్, కిరాణా షాపులను తనిఖీ చేశారు. ఎవరైనా సిగరెట్, గుట్కా, వంటి పొగాకు ఉత్పత్తులు, మాదకద్రవ్యాలు విక్రయిస్తే షాపు యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కొనసాగుతున్న ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్ శిక్షణ

ప్రజాశక్తి - రంపచోడవరం : 53 (ఎస్.టి) శాసనసభ నియోజకవర్గంలో బూత్‌లెవెల్ ఆఫీసర్లకు ఎన్నికల జాబితా నిర్వహణ (ఎలక్టోరల్ మేనేజ్‌మెంట్)పై శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ శిక్షణ కార్యక్రమం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, సబ్‌కలెక్టర్ కల్పశ్రీ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు. శిక్షణ భారత ఎన్నికల సంఘంకు అనుబంధ సంస్థ అయిన ఇండియా ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోంది. శిక్షణ కార్యక్రమం ఆరో రోజు కొనసాగింది. ఇందులో 50 మంది బూత్‌లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు. మొత్తం 9 బ్యాచ్‌లుగా శిక్షణ కొనసాగిస్తున్నారు. ఎలక్షన్ డీటీలర్ సునీత, మాస్టర్ ట్రైనర్ ఎఎల్‌ఎంటి సుధాప్రకాష్ పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత కలిగిన రైతుల జాబితా గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేయడం జరిగిందని స్థానిక వ్యవసాయ అధికారి చక్రధర్ గురువారం తెలిపారు. రైతులు జాబితాలో చూసుకుని పేరు లేకపోతే గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించి ఈనెల 13 లోగా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. భూమి కౌలు చేసుకునేవారు వ్యవసాయ అసిస్టెంట్ లేదా రెవెన్యూ అధికారిని సంప్రదించాలన్నారు.

మంత్రి నాదెండ్ల దృష్టికి సమస్యలు



మంత్రి నాదెండ్లతో వరలక్ష్మి

ప్రజాశక్తి-రంపచోడవరం : నియోజక వర్గం జనసేన వీరమహిళ పండా వరలక్ష్మి, పోతు రాజు గురువారం రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్‌ను సచివాలయంలో ఆయన ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వరలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యంగా నియోజకవర్గంలో పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులు పడుతున్న ఇబ్బందులు 11 మండలాల్లో అస్తవ్యస్థంగా మారినరోడ్లు పరిస్థితిపై మంత్రి మనోహర్‌కు వివరించామని, మంత్రి మనోహర్ సానుకూలంగా స్పందించి సమస్యలు త్వరత గతిన పరిష్కారమయ్యేలా ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారన్నారు.

పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో ఆర్‌జెడి విజయభాస్కర్

జెడ్‌పి హైస్కూల్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - అడ్డతీగల : స్థానిక మండల కేంద్రంలో జెడ్‌పి స్కూల్, ఎమ్మార్సి కేంద్రాన్ని ఆర్‌జెడి విజయభాస్కర్ గురువారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎమ్మార్పీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావం కలిగి ఉండాలని, వెనుకబడిన విద్యార్థుల వివరాలను వెంటనే కంప్లీట్ చేయాలని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల ఆన్‌లైన్ అటెండెన్స్ నమోదు 100 శాతం ఉండేలా చూడాలని, మండలంలో వివిధ డేటా పై కనీస అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థుల నోటుపుస్తకాలను బాగా రాయించాలని ఆదేశించారు. ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మెగా పిటీఎం గురించి అడిగారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిడ్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంఇఒ శ్రీనివాసరావు, మంగరాజు ఇన్‌చార్జి హెచ్ఎం ఆశీర్వాదం, వెంకటేశ్వర్లు, హాజరయ్యారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మురళిగంగాధరరావు

మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మీడియేషన్ ఫర్ ద నేషన్ వన్ వీక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌లో మెజిస్ట్రేట్ మురళీగంగాధరరావు

ప్రజాశక్తి - రంపచోడవరం : స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వుల ప్రకారం రంపచోడవరం మండల లీగల్ సర్వీసెస్ కమిటీ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రాంగణంలో మీడియేషన్ ఫర్ ద నేషన్ వన్ వీక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్‌ను న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ మురళిగంగాధరరావు ప్రారంభించారు. పోస్టర్‌ను విడుదల చేశారు. కరపత్రాలను పంపిణీ చేశారు. మధ్యవర్తిత్వం యొక్క ఉపయోగాలను తెలియజేస్తూ ప్రజలు దానిని వినియోగించుకుని కేసులు పరిష్కారం చేసుకోవాలని ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు, బ్యాంకు వారికి ఓరియెంటేషన్ ప్రోగ్రాంను నిర్వహించారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ ప్రెసిడెంట్ భగవాన్, శ్రీనివాసరావు, మీడియేషన్ న్యాయవాది చుక్క సంతోష్‌కుమార్, ఎండి.జిలాని, డి.లక్ష్మీనారాయణ, ఎం.రవితేజ, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 8 గంటల ముందుగానే రైల్వే చార్టింగ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో ఈ నెల 11వ తేదీ నుంచి 8 గంటల ముందుగానే రైల్వే ప్యాసింజర్ చార్టింగులు రూపొందించనున్నామని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ సీనియర్ డిసిఎం కె.సందీప్ తెలిపారు. రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు ప్రతిరోజు మధ్యాహ్నం 2 గంటల కన్నా ముందు బయలుదేరే రైళ్లకు మునుపటి రోజు రాత్రి 9 గంటల లోపు చార్ట్ తయారవుతుందని, మధ్యాహ్నం 2 గంటల తర్వాత నుండి మరుసటి రోజు ఉదయం 5 గంటల లోపు బయలుదేరే రైళ్లకు ఎనిమిది గంటల ముందుగా చార్ట్ తయారవుతుందని వివరించారు. ప్రస్తుతం 4 గంటల ముందు చార్ట్ తయారవుతోందని, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని మార్పులు చేసినట్టు తెలిపారు.

ముగిసిన గిరి ప్రదక్షిణ

ప్రజాశక్తి- వేపగుంట : నృసింహస్వామి గిరిప్రదక్షిణ గురువారం ముగిసింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ గురువారం ఉదయం 11 గంటల వరకు కొనసాగింది. సుమారు 8 లక్షల మంది భక్తులు పాల్గొన్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. గిరిప్రదక్షిణ విజయవంతం చేయడంలో భాగస్వాములైన కలెక్టర్ హరేంధిరప్రసాద్, సిపి శంకబ్రతబాగ్చీ, దేవాదాయ కమిషనర్ రామచంద్రమోహన్, జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ మయూరిఅశోక్ తదితరులకు కార్యాహణాధికారి వేంద్ర త్రినాధరావు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్సాహంగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు

అరకులోయలో మాట్లాడుతున్న దొన్నుదొర

రంపచోడవరంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలోని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ పేర్కొన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాలల, జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమావేశానికి సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ, సబ్ డివిజనల్‌పోలీస్ అధికారి సాయిప్రశాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కల్పశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు ముందుగా ఒక లక్ష్యం పెట్టుకుని చదవాలన్నారు. రంపచోడవరం సబ్ డివిజనల్ పోలీస్‌అధికారి సాయిప్రశాంత్ మాట్లాడారు. పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సబ్ కలెక్టర్, సబ్ డివిజనల్ పోలీస్ అధికారి సన్మానించారు. కార్యక్రమంలో రంపచోడవరం సర్పంచ్ మంగ బోజ్జయ్య, విద్యా కమిటి చైర్మన్ దుమంతు సుందర్‌సింగ్, వైస్‌చైర్మన్ స్రవంతి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, ప్రధానోపాధ్యాయులు పద్మావతి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విఆర్‌పురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సాయిరమణ ఆధ్వర్యంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి కూటమి నాయకులు, సర్పంచ్ నరసమ్మ, కళాశాల సీనియర్ అసిస్టెంట్ చినబాబు, సిబ్బంది పాల్గొన్నారు. మండలంలో రేఖపల్లి పంచాయితీ అన్నవరం ఎంపిపిఎస్‌లో ఉపాధ్యాయురాలు నాగమణి స్కూల్ చైర్మన్ బురక కన్నారావు, వైస్ చైర్మన్ గాలి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. జెడ్‌పిటిసి వాళ్ళ రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తహశీల్దార్ సరస్వతి , ఎంపిడిఓ ఇమ్మాన్యుయేల్, పాఠశాల హెచ్ఎం అజయ్ కుమార్ పాఠశాల కమిటీ చైర్మన్ శంకరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి బొర్రా నరేష్, టిడిపి సీనియర్ నాయకులు బొర్రా నరసింహారావు బిజెపి మండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు, జనసేన మండల అధ్యక్షులు ములకల సాయికృష్ణ , కూటమి నాయకులు పాల్గొనారు.

చింతూరు: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని చింతూరు ఎఎస్పీ పంకజ్‌కుమార్‌మీనా పిలుపు నిచ్చారు. చింతూరు జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మెగా పేరెంట్స్‌డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. సిఐ దుర్గాప్రసాద్, ఎంఇఒ వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, హెచ్ఎం పెంటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండి విద్య పైనే దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సీలేరు ఎస్ఐ రవీంద్ర సూచించారు. జికె వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, బాలికల ఆశ్రమపాఠశాల, ఎపి గురుకుల పాఠశాలల్లో మెగాపేరెంట్స్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులు, విద్యార్థులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ శంకరరావు ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎస్ఐ రవీంద్ర, రేంజ్‌అధికారి వెంకటరావు, హోమియో వైద్యాధికారి సృజన రాయి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు.

రాజఒమ్మంగి : పిల్లలతో కొంత సమయాన్ని కేటాయించి వారితో స్నేహపూర్వకంగా మెలగాలని రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి స్పష్టం చేశారు. మండలంలోని గురుకుల బాలికల పాఠశాల ఆవరణలో కళాశాల, పాఠశాల ప్రిన్సిపల్స్ సత్యవేణి,షీలా అధ్యక్షత జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్ ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకుని సాధించే వరకూ కష్టపడి చదవాలన్నారు. ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్‌పిటిసి వడుగుల జ్యోతి, సర్పంచ్ రమణి, ఎంపిడిఒ లోకుల యాదగిరిశ్వరరావు, తహశీల్దార్ సత్యనారాయణ, ఎంఇఒ సత్యనారాయణ, సిఐ సన్యాసినాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని హైస్కూల్‌లో హెచ్ఎం సోడె వెంకటరావు అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జెడ్‌పిటిసి గుజ్జా విజయ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లా స్థాయిలో మంచి ర్యాంకులు సాధించాలని కోరారు. అనంతరం పదో తరగతిలో రాణించిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేశారు. పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ జగినివిజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

వై.రామవరం: మండలంలో మెగా పేరెంట్‌టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ పాఠశాల కోట స్కూల్‌లో ఎంపిడిఒ బాపన్నదొర పాల్గొన్నారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో కలిసి భోజనాలు చేశారు. పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఎర్రగొండ ఏకలవ్య పాఠశాలలో 42 బెటాలియన్, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల జీవితం నాశనం అవుతుందని వివరించారు. కార్యక్రమంలో స్పెషల్ గెస్ట్ పార్ట్ టు బెటాలియన్ ఆర్పిఎఫ్ ఒసిఎం రాధ, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరకులోయ:విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అభ్యసించడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్స్ అరకులోయ మండలంలోని కొత్త బల్లు గూడ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్పోర్ట్స్ స్కూల్లో ఆయా పాఠశాల కళాశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు టి.పద్మ, డిపి కుమార్, పిఎస్ఎన్ మూర్తిల ఆధ్వర్యంలో కన్నుల పండుగగా జరిగాయి. మండలంలోని స్పోర్ట్స్ స్కూల్లో నిర్వహించిన పిటీఎం సమావేశంలో దొన్ను దొర ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు సరైన మార్గంలో నడిపించవలసిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులు అంకితభావంతో, పట్టుదలతో విద్యనభ్యసించాలని ఆయన సూచించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల జోలికెళ్ళి భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఆయన సూచించారు.వచ్చే నెల నుంచి కాస్మెటిక్స్ కూడా విద్యార్థినిలకు పంపిణీ చేయనున్నామన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మండలంలోని మిగిలిన పాఠశాల, కళాశాలలో కూడా పిటిఎం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ప్రిన్సిపల్ సన్యాసినాయుడు, దండకరణ కళాశాల ప్రిన్సిపల్ శ్రీను, పెద్దలబుడు మేజర్ పంచాయతీ సర్పంచ్ పెట్టేది దాసు బాబు, కొత్త బల్లు గూడ సర్పంచ్ కొర్ర రాధిక, ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివద్ధి కమిటీ చైర్మన్ మయూరి రాజారావు, వైస్ ప్రిన్సిపల్ రమణ, విద్యా కమిటీ చైర్మన్ లు, మహేష్, రవికుమార్, బురిడీ శాంతి, దేవుడమ్మ పాల్గొన్నారు.

జీకే వీధి :గూడెం కొత్త వీధిలోని ఏకలవ్య, కేజీబీవీ, ఆర్ వి నగర్‌లోని బాలికల పాఠశాల, రింతాడలోని బాలికలు, బాలుర పాఠశాలలో దొడ్డికొండ ఎంపిపి పాఠశాలలో పిల్లల తల్లిదండ్రులతో ప్రతిజ్ఞ చేపించి కార్యక్రమం ప్రారంభించారు.

హుకుంపేట: మండల కేంద్రంలోని పలు పాఠశాలల్లో గురువారం మెగా పేరెంట్స్ ఆత్మీయ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులను ప్రత్యేకంగా ఆహ్వానించారు. స్థానిక ఆలివ్ గ్రీన్ పాఠశాలలో పాఠశాల అభివృద్ధికి సంబంధించి సమావేశం నిర్వహించి కొత్త పాఠశాల కమిటీని ఏర్పాటు చేశారు.చైర్మన్‌గా సిహెచ్. రమణ, వైస్ చైర్మన్‌గా పద్మ కుమారి, సభ్యులుగా మాజీ సర్పంచ్ టి. దేవాన్ రాజు, ఆనందు బొంజి బాబు, సింహాచలం ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు రీమాలి అప్పారావు, ప్రిన్సిపల్ రాజు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అనంతగిరి:జూనియర్ కళాశాలలో స్థానిక ఎంపీపీ శెట్టి నీలవేణి పాల్గొన్నారు. కళాశాలలు, పాఠశాలల పరిశుభ్రత తోనే విద్యార్థుల ఆరోగ్యం బాగుంటుందని సూచించారు ఈ కార్యక్రమలలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీల, ప్రధానోపాధ్యాయులు బి. మంగా సైమన్ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెదబయలు:మండలంలో వివిధ సంక్షేమ వసతి గృహాల్లో గురువారం పండగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక బాలుర రెసిడెన్సియల్ పాఠశాలలో ఎంపీడీఓ ఎల్ పూర్ణయ్య, ఎంఈఓ కొమ్ము కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ పాంగి సోనే హాజరయ్యారు

జిమాడుగుల:కొత్తూరు కేజీబీవీ స్కూల్లో మండల స్పెషల్ ఆఫీసర్, డుమా పీడీ విద్యాసాగర్, స్థానిక డిప్యూటీ తహసిల్దార్ గిడ్డి రాజ్ కుమార్ పాల్గొన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాన్ని అధిరోహించాలని, చదువుపై దృష్టి పెట్టాలని తెలిపారు.

దుంబ్రిగుడ:ఉపాధ్యాయులు విద్యార్థులు, తల్లితండ్రులు, అందరి భాగస్వామ్యంతోనే గిరిజన విద్యాభివృద్ధి చెందుతుందని ఐటీడీఏ పీవో అభిషేక్ గౌడ్ అన్నారు పేరెంట్స్ డే సందర్భంగా జాముగుడ ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు.సరస్వతిదేవి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులను అర్పించారు. ఆయన మాట్లాడారు. గిరిజన విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతోందన్నారు. వసతితో కూడిన విద్యతో గిరిజన విద్యార్థులు, విద్యార్థులకు అన్ని విధాల సౌకర్యాల కల్పనతో విద్యాభివృద్ధిని అమలు చేస్తోందన్నారు. విద్యతోపాటు సంపూర్ణ భోజన మెనూతో విద్యార్థులు శారీరక ఎదుదలకు తోడ్పాటునందిస్తున్నామన్నారు. కేజీబీవీలో జరిగిన ఆత్మీయ సమావేశంలో అరకు సీఐ హిమగిరి పాల్గొని మాట్లాడారు. బాల్య వివాహాలు విడనాడాలని, గంజాయి, మాదక ద్రవ్యలకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రమణ, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

పలుచోట్ల బహిష్కరణలు, నిరసనలు

సమావేశాన్ని బహిష్కరించిన తల్లిదండ్రులు

ఎమ్మెల్యే శిరీషాదేవికికు సమస్యలను విన్నవిస్తున్న విద్యార్థినులు

రాజఒమ్మంగి :స్థానిక ఏకలవ్య పాఠశాలలో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు బహిష్కరించారు. ప్రిన్సిపాల్ వ్యవహార శైలి సక్రమంగా లేదంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, ఐటిడిఎ పిఒ సింహాచలం పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ప్రిన్సిపల్ కృష్ణారావు తమను లోపలికి రానివ్వడం లేదని దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎమ్మెల్యే శిరీషదేవి, పిఒ సింహాచలం మాట్లాడుతూ తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బూసికొండలో సమావేశాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

సీలేరు: జికె వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ బూసికొండలో మెగా పేరెంట్స్ మీటింగ్ నిర్వహించడానికొచ్చిన ప్రతినిధిని విద్యార్థులు తల్లిదండ్రులు అడ్డుకున్నారు. జూన్ 12 నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించకుండా అధికారులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ఏం చేయాలో తెలియక వచ్చిన ప్రతినిధి బిక్క మొఖం వేసుకొని చూస్తూ ఏం చేయాలో తెలియక వెనుదిరిగారు.

చింతూరులో పాల్గొన్న ఎస్‌పి పంకజ్‌కుమార్

దుంబ్రిగుడలో ప్రమాణం చేయిస్తున్న ఐటిడిఎ పిఒ

కూనవరంలో తల్లులకు వందనం చేస్తున్న విద్యార్థులు

సీలేరులో బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్, తదితరులు



నౌకా నిర్మాణంలో హెచ్ఎస్ఎల్ దూకుడు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ గడిచిన 24 గంటల్లో రెండు రెండు ప్రధాన ఘట్టాలను పూర్తి చేసింది. ఈ నెల 8వ తేదీన అధునాతన డిపి-2 డైవింగ్ సపోర్ట్ వెసెల్ నిస్తార్‌ను భారత నావికాదళానికి అప్పగించగా, 9న కట్టుపల్లిలోని ఎల్అండ్‌టి షిప్‌యార్డ్ ఫ్లీట్ సపోర్ట్ షిప్ - 3 కీల్‌ను వైస్ అడ్మిరల్ రాజారాం స్వామినాథన్ సమక్షంలో హెచ్ఎస్ఎల్ చైర్మన్ అండ్ ఎమ్‌డి హేమంత్ ఖత్రి, భారత నావికాదళం, హిందుస్తాన్ షిప్‌యార్డు ఎల్ అండ్ టి సీనియర్ అధికారులతో కలిసి వేశారు. హిందుస్తాన్ షిప్‌యార్డుకు ఇవ్వబడిన టిఎఫ్ఎస్ఎస్ సిరీస్‌లోని ఐదు నౌకల ఒప్పందంలో ఫ్లీట్ సపోర్ట్ షిప్ - 3 మూడవది, దీన్ని ఎల్ అండ్ టి సహకారంతో నిర్మించారు. ఇది భారతదేశం బలమైన ప్రభుత్వ-ప్రైవేట్ రక్షణ భాగస్వామ్యాన్ని హైలైట్ చేస్తుందని, ముఖ్యంగా ఐదు ఎఫ్ఎస్ఎస్‌లు ఏకకాలంలో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని అధికారులు వివరించారు. ఒప్పందం ప్రకారం రెండేళ్లలోపు ఈ నౌకల నిర్మాణాన్ని హిందుస్థాన్ షిప్ యార్డు లిమిటెడ్ పూర్తి చేసిందని, చిన్న సహాయక నౌకల నిర్మాణం నుంచి ఐఎన్ఎస్ ధృవ్, నిస్తార్ వంటి ఓడలను హెచ్ఎస్ఎల్ నిర్మించిందని, మేకిన్ ఇండియాలో భాగంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో హెచ్ఎస్ఎల్ ఈ నిర్మాణాలను చేపట్టినట్లు అధికారులు వివరించారు.

శాంసంగ్ ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్లు విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ రూపొందించిన ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్లను విశాఖలో విడుదల చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సంస్థ ప్రతినిధి టిఎం.రాయ్ మాట్లాడుతూ, 2019లో మొదటిసారిగా గెలాక్సీ జెడ్ ఫోల్డ్‌తో ప్రారంభమైన ఫోల్డబుల్ సిరీస్ మరింత ముందుకు తీసుకెళ్లే క్రమంలో గెలాక్సీ జెడ్ ఫోల్డ్ 7 విడుదల చేసినట్లు తెలిపారు. ఈ ఫోన్ 8.2 డిస్‌ప్లే కలిగి, ఆండ్రాయిడ్ వెర్షన్ 15తో, 200 మెగాపిక్సల్ కెమెరా, 4400 ఎంఎహెచ్ బ్యాటరీ, 12 జిబి రామ్, 256 జిబి స్టోరేజ్‌తో లభిస్తుందని వివరించారు.

బోటు ఇంజన్లు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మత్స్యకారులకు బోటు ఇంజన్ల సరఫరా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ ఫిష్ ఫార్మర్స్ డేను పురస్కరించుకొని పెద్ద జాలారిపేట గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యాన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద మత్స్యకారులకు 55 బోటు ఇంజన్లను తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ద్వారా అందజేశారు. వీటి విలువ రూ.45.81 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ.18.32 లక్షలు ఇస్తుందని అధికారులు తెలిపారు. వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మత్స్యకారులకు సబ్సిడీపై వస్తువులు అందిస్తున్నామన్నారు. వేట విరామ సమయంలో మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు ఇచ్చామని తెలిపారు. కార్యకమంలో జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు ఎం.గురునాధరావు, ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, ఎఫ్‌డిఓ ఆశాజ్యోతి, మత్స్యకారుల సహకార సంఘం అధ్యక్షుడు అప్పన్న పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

ఇంటింటికీ స్టిక్కర్లు అంటించిన సిపిఎం కార్యకర్తలు

ఇంటింటికి తిరిగి ప్రచారం చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ వినియోగదారులపై విపరీతమైన భారాలు మోపే స్మార్ట్‌మీటర్లను ఏర్పాటుచేయవద్దని ప్రచారం చేస్తూ ఇంటింటికి స్టిక్కర్లు అంటించే కార్యక్రమాన్ని సిపిఎం కార్యకర్తలు ప్రారంభించారు. జివిఎంసి 38వ వార్డు పరిధి బుక్కా వీధిలో గురువారం ఇంటింటికీ స్టిక్కర్లు అంటించారు. స్మార్ట్‌మీటర్లు వద్దు, కరెంటు చార్జీలు తగ్గించాలి అంటూ రూపొందించిన స్టిక్కర్లు అంటించే కార్యక్రమంలో, సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, సిఐటియు జగదాంబ జోన్ ప్రధానకార్యదర్శి కర్రి చంద్రశేఖర్, గనగళ్ల అప్పన్న తదితరులు పాల్గొన్నారు. స్మార్ట్‌మీటర్లు వస్తే, విద్యుత్ భారాలు మరింత పెరుగుతాయని, ఒక్కొక్క స్మార్ట్‌మీటర్ ఏర్పాటుకు రూ.9వేలు ఖర్చు అవుతుందని, ఈ సొమ్మును ప్రతి నెల వినియోగదారుల నుంచి వసూలు చేస్తారని చెప్పారు. ఈ చర్యను ప్రజలంతా వ్యతిరేకించాలని కోరారు. అదాని వంటి వారికి ప్రయోజనం కలిగించడం కోసమే స్మార్ట్‌మీటర్లు ఏర్పాటుచేస్తున్నారని విమర్శించారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఐద్వా ర్యాలీ

ఇంటింటికీ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ 28వ వార్డు పరిధి పందిమెట్ట ప్రాంతంలో ఐద్వా ఆధ్వర్యాన మహిళలు గురువారం ర్యాలీ నిర్వహించారు. కె.మణి ఆధ్వర్యాన సిపిఎం నాయకులు బి.ఎ.నాయుడు 11వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జోన్ నాయకులు ఆర్.వరలక్ష్మి మాట్లాడుతూ, తమ ప్రాంతానికి చెందిన బిఎ నాయుడు రాత్రి, పగలు అనే తేడా లేకుండా సమస్య ఎక్కడుంటే అక్కడ హాజరయ్యేవారని తెలిపారు. ఆయన లేని లోటు ఎన్నటికీ తీరనది అన్నారు. అనంతరం విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా వార్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కె.మణి మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లు రానివ్వకపోవడమే బి.ఎ.నాయుడుకు మనమిచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు బి.సత్యవతి మాట్లాడుతూ నాయుడు ఆశయాల సాధనలో ముందున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు పద్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే చంద్రబాబుకు ఎందుకంత భయం

మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి అంటే చంద్రబాబుకు ఎందుకంత భయమని వైసిపి దక్షిణ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రశ్నించారు. ఆశీలుమెట్ట కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మామిడి రైతులకు మద్దతు ఎందుకు ఇవ్వరని జగన్మోహన్‌రెడ్డి అడగడం నేరమా? అని ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లేక, రోడ్డున పడేసిన మామిడి మీకు కనిపించలేదా, మొన్న మిర్చి, నిన్న పొగాకు, ఇప్పుడు మామిడి రైతు వంతు వచ్చిందన్నారు. చిత్తూరు జిల్లాలో రోడ్డున పడ్డ మామిడి రైతులకు మద్దతు తెలిపేందుకు వచ్చిన జగన్మోహన్‌రెడ్డిపై కూటమి నాయకులు కుతంత్ర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. మామిడి పండ్లుపై రెండు రూపాయల ధర పట్టిక పెట్టి, కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు ఎండగట్టారు. అక్కడి తోతాపురి మామిడికాయలకు గిట్టుబాటు ధర రెండు రూపాయలు ఇస్తే రైతులు ఎలా బతకాలని ప్రశ్నించారు. రైతులకు జగన్మోహన్‌రెడ్డి మద్దతు ఇస్తే ఓర్వలేక అక్రమ కేసులు బనాయించడం సిగ్గుచేటు అన్నారు. నారా లోకేష్ కేవలం రెడ్ బుక్ రాజ్యాంగానికి, పవన్ కల్యాణ్ కూటమికి పోస్టర్ మాదిరి మిగిలిపోయారని విమర్శించారు. ఈ సమావేశంలో వైసిపి రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ జాన్ వెస్లీ, జిల్లా బిసి విభాగం అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్, ఎర్రనమ్మ తల్లి గుడి చైర్మన్ లండన్ రమణ, విశాఖ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్ పాల్గొన్నారు.

విశాఖలో 14, 15 తేదీల్లో 'బిమ్‌స్టెక్' కాన్‌క్లేవ్!

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

7 దేశాల మధ్య సముద్ర వాణిజ్యం (ట్రేడ్) పెంపొందించే లక్ష్యంతో విశాఖ కేంద్రంగా రెండో ఎడిషన్ బిమ్‌స్టెక్ కాన్‌క్లేవ్ ఈనెల 14, 15 తేదీల్లో విశాఖ పోర్టు అథారిటీ (విపిటి) ఆతిథ్యంలో నిర్వహించేందుకు పోర్టు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బంగ్లాదేశ్, ఇండియా, మయన్మార్, శ్రీలంక, థాయ్‌లాండ్, భూటాన్, నేపాల్‌తో కలిపి (బిమ్‌స్టెక్)గా ఏర్పాటయ్యాయి. ఈ దేశాల సముద్ర జలాల రీజియన్‌లో వర్తక, వాణిజ్యం మరింత పెంపొందించేందుకు గానూ భవిష్యత్తు అభివృద్ధికి దోహదపడేలాగ రెండో ఎడిషన్ విశాఖలో ప్రారంభం కానుంది. సాగరతీరంలో ఓ ప్రైవేట్ హోటల్‌లో 2 రోజుల పాటు జరగనున్నాయి. కేంద్ర పోర్టులు, షిప్పింగ్ మంత్రి సహా ఢిల్లీ నుంచి అధికార ప్రముఖులు హాజరయ్యే అవకాశాలున్నాయి.ఆయా దేశాల నుంచీ అధికార ప్రతినిధులు హాజరు కానున్నారు. రీజనల్ మార్రిటైం కనెక్టివిటీ కో-ఆపరేషన్‌కై 7 దేశాలు ఒకే విజన్‌తో కలిసి ముందుకు సాగడమే లక్ష్యంగా ఈ కాన్‌క్లేవ్-2025 సమ్మిట్‌లో ఆయా దేశాల ప్రతినిధులు చర్చించనున్నారు. గతంలో విశాఖ కేంద్రంగా 2019 నవంబర్ 7, 8 తేదీల్లో బిమ్‌స్టెక్ అధికారుల కాన్‌క్లేవ్‌కు విశాఖ పోర్టు ఆతిథ్యం ఇచ్చిన సంగతి తెలిసిందే. తూర్పు తీరంలో తమ దేశాలు ఎలా సహకారం అందించుకోవాలి, భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనే అంశాలపై ఎంఒయులను పరస్పరం పలు దేశాలు చేసుకున్నాయి. ఆర్థిక పరమైన లక్ష్యాలే కాకుండా క్రూయిజ్ షిప్‌లను నిర్వహించేందుకు మార్రిటైం టూరిజాన్ని పెంపొందించే కృషిపైనా గతంలో సమీక్షించారు. మన దేశంలోని మేజర్ పోర్టుల ప్రతినిధులు, చైర్మన్లు, అధికార ప్రతినిధులు ఈ నెల 14, 15 తేదీల్లో కాన్‌క్లేవ్‌లో పాల్గొననున్నారు. రాష్ట్ర ప్రభుత్వపెద్దలు హాజరయ్యే అవకాశాలున్నాయి.

రైతుబజార్‌ను పరిశీలిస్తున్న మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసకిరణ్

రైతుబజార్లకు నాణ్యమైన కూరగాయలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : రైతుబజార్లలో ఉల్లి, టమోటా, బంగాళాదుంపలు, మిర్చి, అల్లం వంటి కూరగాయలను కొరత లేకుండా, నాణ్యమైనవి వినియోగదారులకు సరఫరా జరిగేలా హోల్‌సేల్ మార్కెట్ వ్యాపారులు సహకరించాలని మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసకిరణ్ ఆదేశించారు. జ్ఞానాపురంలోని న్యూహోల్‌సేల్ మార్కెట్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

క్రోమా బ్యాక్ టు క్యాంపస్ సేల్ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : టాటా గ్రూప్ నుండి ఓమ్ని ఛానల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్ అయిన క్రోమా తన క్యాంపస్ సేల్‌ను ప్రకటించిందని క్రోమా ప్రతినిధి నేత్ర దేశాయి తెలిపారు. డాబాగార్డెన్స్‌లోని ఒక హోటల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆధునిక విద్య, సాంకేతిక పరిజ్ఞానం, ఈ ప్రచారం విద్యార్థులు, టెక్ ప్రియులకు శక్తినివ్వడానికి రూపొందించినట్లు వివరించారు. మంచి బ్రాండ్లు, సున్నా-ధర ఇఎంఐ, క్యాష్‌బ్యాక్, వీటిలో ఎక్స్ఛేంజ్, క్యాష్‌బ్యాక్, ప్లస్ వైర్‌లెస్ మౌస్, యాంటీవైరస్ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు

రైల్వేస్టేషన్‌లో క్యాప్సూల్ హోటల్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల సౌకర్యాలను మరింత మెరుగుపరిచే క్రమంలో విశాఖపట్నం రైల్వే స్టేషన్లో క్యాప్సూల్ హోటల్‌ను బుధవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వాల్తేరు డిఆర్ఎం లలిత్రా బోహ్రా మాట్లాడుతూ, ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో మొదటిసారిగా ప్రయాణికుల సౌకర్యార్థం క్యాప్సూల్ హోటల్ (స్లీపింగ్ పోడ్స్)ను విశాఖపట్నం రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారం నెంబర్ 1లోని 3వ గేటు వద్ద ఏర్పాటుచేసినట్లు తెలిపారు. రూ.80 లక్షలతో పిపిపి విధానంలో శ్రీ మహాలక్ష్మి ఏజెన్సీకి 5 ఏళ్ల లీజుకు ఇచ్చినట్లు వివరించారు. ఏడాదికి రూ.1.5కోట్ల ఆదాయం రైల్వేకు లభిస్తుందని తెలిపారు. ఈ హోటల్‌లో 88 బెడ్స్ అందుబాటులో ఉంటాయని, అందులో 73 సింగల్ బెడ్స్, 15 డబుల్ బెడ్స్‌తో పాటు మహిళల కోసం ప్రత్యేకంగా 18 బెడ్ లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కనిష్టంగా మూడు గంటల నుండి గరిష్టంగా 24 గంటల వరకు బసచేసే అవకాశం ఉందని తెలిపారు. సింగల్ బెడ్స్‌కు రూ.200 నుంచి రూ.400, డబుల్ బెడ్స్‌కు రూ.300 నుంచి రూ.600 అద్దె చెల్లించాలని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో వాల్తేరు డివిజన్ సీనియర్ డిసిఎం కె.సందీప్, హోటల్ నిర్వాహకులు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

-విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి- కలెక్టరేట్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అన్ని చోట్లా ఫాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. స్వర్ణాంధ్ర పి-4 ఫౌండేషన్, పాజిటివ్ పబ్లిక్ పెరసప్షన్, రిలయెన్స్ కంప్రెస్డ్ బయోగ్యాస్ యూనిట్లు, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, వివిధ సంక్షేమ వసతి గృహాల నిర్వహణ తదితర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ వీసీ హాలు నుంచి వర్చువల్‌గా పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిర ప్రసాద్ జిల్లాకు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ వివిధ అంశాలపై చేపట్టాల్సిన చర్యల గురించి కలెక్టర్ పలు సూచనలు చేశారు. అన్ని వసతి గహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుధ్యచర్యలు పక్కాగా చేపట్టాలని సూచించారు. దోమల నివారణలో భాగంగా వీధులు, ప్రధాన ప్రాంతాలు, వసతి గృహాలు, అపార్ట్‌మెంట్ల వద్ద క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని చెప్పారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు చర్యలు చేపట్టాలని సూచించారు.